# ప్రేమకు నేను పేదను కాను

గొల్లపూడి శైలజ

"అమ్మా" అని పిలిచాడు రాజిగాడు.

"ఏమిట్రా" ఇటు తిరిగిందావిడ. వృద్ధాప్యపు ఛాయలు స్పష్టంగా కనబడుతున్నాయామె మొహంలో.

"చెప్పు ఏం కావాలి?" మళ్లీ అడిగిందావిడ. ఎంతో దయని వర్షిస్తున్నాయామె కళ్లు.

"రేపు నేను ఊరెళతానమ్మా. మా అమ్మని చూసి నెలపైనే అయింది. మా అమ్మకి వంట్లో బావోలేదని మా ఊరతను కనిపించి చెప్పాడు" దిగులుగా ఉంది వాడి గొంతు.

"పోయి మీ అమ్మని చూసిరా! కానీ ఈ అమ్మని మర్చిపోకుండా రెండు రోజుల్లో రావాలి... పైసలేమన్నా కావాలా?"

"వద్దమ్మా. మీరు ఒంటరిగా..." నసిగాడు వాడు.

"మరేం ఫర్వాలేదు లేరా? నువ్వు రాక ముందు నేను ఒంటరినేగా... అంతగా అవసరమైతే పక్కింటి కళ్యాణి పడుకుంటుంది లే. వెళ్ళి బట్టలు సర్దుకో."

హుషారుగా పెద్దపెద్ద అంగలేసుకుంటూ పోయాడు వాడు.

తన ఒంటరితనం మీద రాజిగాడికున్న జాలి తన కన్నకొడుక్కి కూడా లేదు. అదే ఆవిడకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుందెప్పుడూ. ఆలోచిస్తున్న కొద్దీ విచిత్రంగా వుంటుంది కొడుకు ప్రవర్తన. వాడికి తనేం తక్కువచేసిందో అర్థం కాదు. అతి గారాబంగా పెంచారు వాణ్ణి. వాడు అడిగిందల్లా నిమిషాల్లో తెచ్చిపెట్టారు. అప్పుచేసైనా వాడు అడిగిన చదువులు చెప్పించారు.

రబ్బరుబొమ్మలా ఉయ్యాల్లో కూర్చుని ఊగే ఆరునెల్ల పాపడిలానే గుర్తున్నాడు శరత్ ఆ తల్లికి. వళ్లో కూర్చోబెట్టుకొని ఎ.బి.సి.డి.లు రాయించినట్లే లేదు. అప్పుడే ఉద్యోగస్థుడై పోయాడు. ఉద్యోగాలు తల్లీ బిడ్డల్ని ఇంత క్రూరంగా విడదీస్తాయని ఆవిడకి తెలీదు. తెలిసుంటే చదువే చెప్పించకపోవునేమో!

రెండేళ్ళ క్రితం......

"అమ్మా నాకుద్యోగమొచ్చిందే. ఎక్కడో తెలుసా? ఢిల్లీలో. మూడు వేలు జీతం" ఆనందంతో గెంతులేస్తూ వచ్చి చెప్పాడు శరత్.

"ఢిల్లీలోనా అంత దూరమే" నోరుతెరిచిందా తల్లి.

"దూరంకాకపోతే ఇంత మంచి ఉద్యోగాలు మన పక్కింట్లో దొరుకుతాయా" వెక్కిరించాడు శరత్.

"ఓ పది రోజుల్లో చేరాలి. రిజర్వేషన్ దొరుకుతుందో లేదో" హడావిడిగా స్టేషన్‌కి పరిగెత్తాడు. ఒక్కొక్క రోజు గడుస్తుంటే దిగులు పేరుకుపోతోంది మనసులో.

"నేనూ నీకూడా వస్తానా".

బట్టలు సర్దుకుంటున్న శరత్ విస్తుబోయి తలతిప్పి చూసాడు.

"నీకక్కడ ఏంతోస్తుందమ్మా. అయినా అక్కడ మనకేమన్నా స్వంత ఇల్లుందా. నేనైతే ఓ ఫ్రెండ్ రూమ్‌లో సర్దుకుంటా, నువ్వెలా? నేను కొంచెం స్థిరపడేంతర్వాత వద్దువుగాన్లే—" మళ్లీ బట్టలపెట్టె వైపు తిరిగాడు.

ఖిన్నురాలైందావిడ. దూర ప్రాంతంలో వుద్యోగమొస్తే మళ్ళీ నేను నిన్ను విడిచి వెళ్ళనమ్మా' అని ఏడుస్తాడేమో, ఎలా ఓదార్చాలా అని ఆలోచించేదావిడ ఇన్నిరోజులూ. తల్లిని వదిలిపెట్టి వెళుతున్నానన్న దిగులే లేదు వాడికి. ఎంత సంతోషంగా వున్నాడో— నిట్టూర్చిందావిడ.

అప్పుడు ఏమన్నా పసిపాపడా భయపడటానికి. చిన్నప్పుడు ఒక్క ఐదు నిమిషాలు ఎవరిదగ్గరన్నా విడిచిపెడితే, తిరిగొచ్చేసరికి మొహమంతా కన్నీళ్లతో తడిసిపోయేది. వాణ్ణి వళ్లోకి తీసుకొని కథలు చెప్పి, అందంగా చేతులనిండా చాక్లెట్లు పోస్తే ఏడుపు మానేవాడు. తన గారాబానికి భర్త విసుక్కునే వాడు కూడా.

తన ఈ ఒంటరి జీవితాన్ని భర్త ముందే ఊహించినట్టున్నాడు. మరణించే ముందు రోజు శరత్‌ని దగ్గరికి తీసుకొని "ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మని ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళకు. మీ అమ్మకి వుంది నువ్వు, నేనే. నేను పోయినతర్వాత బాధ్యత వహించాల్సింది నువ్వే" అని బోధించాడాయన. అప్పటికి అందంగా తలూపి, ఆయన ఆత్మకి శాంతి కలిగించగలిగాడేమో కానీ, తనకి ఆనందాన్ని మాత్రం ఇవ్వలేకపోయాడు.

నువ్వు రావద్దని నిష్కర్షగా చెప్పి ఢిల్లీకి వెళ్లిపోయాడు. వెళ్లిం తర్వాత నెలకో ఉత్తరం కూడా రాయటం మానేసాడు. తను చెట్టంత కొడుకుండి కూడా ఏకాకైపోయింది. ఓ రోజు కొడుకు దగ్గర్నుంచి ఉత్తరమొచ్చింది. అందులో — ఓ పెళ్ళిఫోటో. అనుకోకుండా పెళ్ళికుదిరిందనీ, వాళ్లు చాలా వున్నవాళ్లనీ, హనీమూన్‌కి వాళ్ల మామగారు అమెరికాకి పంపిస్తున్నాడనీ— దాని సారాంశం. చెప్పకుండా పెళ్లిచేసుకునేంత పాపం తనేం చేసిందో ఆ పిచ్చితల్లికి అర్థం కాలేదు. మూడు రోజులు నిద్రాహారాలు మాని ఏడ్చింది. మెల్లిగా తేరుకుని— 'నీ పెళ్లి ఎవరితో జరిగినా నా ఇష్టమే. కోడల్ని తీసుకుని ఈ అమ్మని చూడడానికొస్తావని ఆశిస్తున్నా' అని ఉత్తరం రాసింది.

అలా సంవత్సరం పాటు కేవలం ఆ వృద్ధ హృదయం తపనను తెలియజేస్తూ ఉత్తరాలు పోతూనే వున్నాయి. వచ్చేవే తక్కువ. మళ్ళీ ఓ ఫోటో పంపించాడు కొడుకు— అబ్బాయి పుట్టాడని, రాహుల్ అని పేరు పెట్టామని. మనవడ్ని చూడాలని కొట్టుకులాడిందావిడ హృదయం. కానీ, రమ్మని కొడుకు ఆహ్వాన

మేది? అంత పెద్ద ఇంట్లో ఒంటరితనం— ఆవిడ్ని నిప్పుల్లో వేసి వేధించసాగింది.

"అమ్మా. మీ కోసం ఎవరో వచ్చారు." రాజిగాడి పిలుపుతో ఈ లోకంలోకొచ్చిందావిడ. నెమ్మదిగా లేచి ముందుగదిలోకి నడిచింది. అతను శరత్ ఫ్రెండ్. ఢిల్లీ నుండి వస్తుంటే శరత్ ఉత్తరమిచ్చాట్ట. జేబులోంచి ఉత్తరం తీసిచ్చి, కాఫీ తాగమన్నా తాగకుండా పనుందని వెళ్ళిపోయాడా అబ్బాయి.

అది శరత్ చేతివ్రాత. దాన్ని చూస్తూనే ఆనందంతో పొంగిపోయిందామె మనసు. అనుకోకుండా కొడుకు దగ్గర్నించి వచ్చిన ఉత్తరం చూసి, పరమానందం చెందిందా తల్లి. వణుకుతున్న వేళ్లతో ఉత్తరం విప్పింది.

"నేను మన ఊరికి వస్తున్నాను. మూడు రోజులుంటాను" సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిందా తల్లి, ఆ వాక్యం చదివి. రెండేళ్ళ తర్వాత కొడుకుని చూడబోతున్నానన్న భావం ఆమెకు కొత్త జీవితాన్ని ప్రసాదించినట్లయింది.

మళ్లీ కాగితం వైపు దృష్టి సారించింది.

"ఓ వారం రోజులు మా అత్తగారింట్లో ఉంటాము. ముఖ్యంగా చెప్పేదేమిటంటే ఇల్లంతా కాస్త శుభ్రంగా సర్దించు. నీకు తెలుసుగా నా భార్య కంపారమ్మాయి. వాళ్ళిల్లు చాలా శుభ్రంగా ఉంటుంది. మనింట్లోలాగా దిండ్లు, పక్కబట్టలు, కర్టెన్లు మురికిగా, పాతగా ఉండవు. అన్నింటినీ తెల్లగా ఉతికించి పెట్టు. వీలైతే ఇంటికి సున్నం కొట్టించు. సోఫా ఒకటి కొనిపెట్టు. వాళ్లు మనలా చెక్కకుర్చీలో కూర్చోరు. పక్కింట్లో ఫ్రిజ్ ఉంటే చల్లటి నీళ్లు తెప్పించి పెట్టు. లేకపోతే షాపు నుంచి ఐస్ తెప్పించు. వాళ్లు కుండల్లో నీళ్లు తాగరు. బాత్‌రూమ్ తలుపుగడియ సరిగా పడుతుందో లేదో చూడు. పాచిలేకుండా కడిగించి పెట్టు. దక్షిణం వైపున్న గది విశాలంగా ఉంటుంది. అందులో వున్న నాన్నగారి పాత సామాన్లన్నీ తీయించి అటకమీద సర్దించు. ఇల్లు కాస్త విశాలంగా ఉండేలా చూడు. ఎందుకంటే రాహుల్ ఇల్లంతా పాకుతూ ఏది కనబడితే అది నోట్లో పెట్టుకుంటున్నాడు. ఆ పనివాణ్ణి శుభ్రంగా స్నానం చేసి బట్టలు కట్టుకోమ్మను. రాహుల్ని ఎత్తుకోవడానికి ఓ పనివాడున్నాడిక్కడ. వాణ్ణే మాతో తీసుకురావడం లేదు. అక్కడున్న మూడు రోజులూ వాడే ఎత్తుకోవాలి. మిగతా విషయాలన్నీ సమక్షంలో." ఆ ఉత్తరం చదవడం పూర్తిచేసి అలాగే కూర్చుండిపోయిందావిడ.

కన్నతల్లిని చూడటానికి రావడానికి ఇన్ని హంగులా! ఇదేమన్నా హోటలా! అన్ని పనులు చేయించడానికి. అసలు తనకి డబ్బెక్కడ్నుంచి వస్తుందన్న విషయం ఆలోచించనే లేదా? వున్నదంతా పెట్టి వాణ్ణి పెద్ద చదువులు చదివిస్తే, వాడు ఒక్కనాడన్నా తనని 'డబ్బేమన్నా కావాలా అమ్మా' అని అడిగాడా? అంత పెద్ద ఉత్తరంలో 'బాగున్నావా అమ్మా' అని నామమాత్రంగానైనా అడిగాడా? ఇటువంటి కొడుకునా తను కన్నది? వాడిలో ప్రవహించేది తన రక్తమేనా అసలు? తను ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా రోజూ తడిమిచూసుకునే భర్త జ్ఞాపకాలు వాడికి పాతసామాన్లలా కనబడ్డాయా?

భోరున ఏడవబోయింది. అంతలో ఆవిడకి ఏనాడో భర్త చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

'డబ్బు మానవ సంబంధాల్ని తెంచివేస్తుంది. ఆడంబరమైన జీవితం, ఆదర్శమైన జీవితాన్ని కప్పిపెడుతుంది. తల్లీ, చెల్లీ సంబంధాలన్నీ పాత చింతకాయపచ్చడిలా, అనవసరమైనవిలా తోస్తాయి. అవతలికి నెట్టివేయబడతాయి.'

ఇంక కళ్లలోంచి నీరు బయటికి రాలేదావిడకి. హృదయం లేని కొడుకు కోసం ఇంక తన కన్నీళ్లని వృథాపర్చదల్చుకోలేదావిడ.

"ఏంటమ్మా! అట్లా కూర్చున్నారు. తలనొప్పా. కొంచెం కాఫీ తేనా" రాజిగాడి గొంతులో ఆదుర్దా. తలెత్తి వాడి వంక చూసిందావిడ. తనేం వంటరిది కాదు. తన్ని అనుక్షణం కనిపెట్టుకునుండే చెట్టంత కొడుకున్నాడు. వాడిలో ప్రవహించేది తన రక్తం కాకపోయినా అసలైన మానవ రక్తం. టేబులుమీదున్న కవరు, కలం చేతిలోకి తీసుకుంది.

'నువ్వొచ్చే సమయానికి నేనింట్లో ఉండలేకపోతున్నాను. తెలిసినవాళ్ళకి బాలేదంటే పొరుగూరు వెళుతున్నాను. అయినా ఈ పల్లెటూర్లో మూడు రోజులు మాత్రం నీకేం తోస్తుంది? ఆ సమయాన్ని కూడా ఆనందంగా మీ అత్తగారింట్లో గడుపుతావని ఆశిస్తున్నాను' నాలుగు లైన్లు బరికి కవరు మీద అడ్రసు రాసి అంటించింది.

"తొందరగా వెళ్ళి ఈ ఉత్తరం పోస్ట్ చేసిరా. ఇంతలో నేను కూడా బట్టలు సర్దుకుంటా" అందావిడ.

"మీరెక్కడికమ్మా?" తెల్లబోయాడు వాడు.

"మీ అమ్మకి బాలేదన్నావుగా. చూసొద్దాం. ఇంత మంచి కొడుకుని కన్న తల్లిదండ్రుల్ని నేను చూడద్దా మరి."

మీరు కూడా వస్తే సాయంత్రం బండికి పోదామమ్మా. ఇంత ఎండని తట్టుకోలేరు మీరు" అన్నాడు వాడు ఆనందంగా.

వాడి ఆప్యాయతకి కళ్ళు చెమర్చాయావిడకి. ●

